క్లుప్తంగా

ఉన్నత జీవిత లక్ష్యాలను కలిగి ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: విద్యార్థులు ఉన్నత జీవిత లక్ష్యాలను కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. స్థానిక సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుకున్న విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. పలు క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వీర్నపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో నరేశ్‌కుమార్‌కు పంచాయతీ కార్మికులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. మండల పంచాయితీ కార్మికుల అధ్యక్షుడి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల దృష్ట్యా రూ.8 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కారో బా ర్లను, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ కార్యదర్శులు గా నియమించాలన్నారు. న్యాత నర్సయ్య, లక్ష్మణ్, సంతోష్, యాదగిరి, రాజయ్య పాల్గొన్నారు.

రుణ మాఫీ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు రుణమాఫీ చేయడం లేదని బీజేపీ నాయకులు శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు బెంద్రం తిరుపతి మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో లక్ష వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ధర్నాలో మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, రాజు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యాలయాలు

- భయం గుప్పిట్లో విద్యార్థులు
- ప్రతిపాదనలు పంపినా మంజూరుకాని నిధులు
- నీరుగారిపోతున్న మన ఊరు- మన బడి



శిథిలావస్థలో మర్రిపల్లి పాఠశాల భవనం

వేములవాడరూరల్: విద్యాలయాల్లో అన్ని వసతులు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి అనే కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం మూలంగా నీరుకారి పోతోంది. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నా, వాటిని అధికారులు గుర్తించడంలో విఫలమైనారని, కొన్ని పాఠశాలలు బాగున్నప్పటికీ వాటిని మొదటి విడతలో వాటిని ఎంపిక చేసినట్లు ఆరోపణలున్నాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరిన వాటిని మొదటి విడతలో ఎంపిక చేయకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామాలుండగా ఈ గ్రామాల్లో కేజీబీవీ మర్రిపల్లి పాఠశాలతో పాటు 26 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో తొమ్మిది పాఠశాలలు మన ఊరు, మనబడి కింద మొదటిసారి ఎంపిక చేశారు. ఇప్పటివరకు ఆ పాఠశాలల్లో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఎనిమిది పాఠశాలల్లో పలు ఇబ్బందులున్నా విద్యాబోధన అందిస్తున్నారు. ప్రధానంగా మల్లారం, బొల్లారం, కొత్తపల్లి, మర్రిపల్లి, ఫాజుల్‌నగర్, చెక్కపల్లి, వట్టెంల, మర్రిపల్లి పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాలు, మరమ్మతుల విషయమై ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయినా ఇప్పటివరకు నూతన భవనాల కోసం నిధులు మంజూరు కాలేదని తెలిసింది.

మూతబడిన మూడు పాఠశాలలు

మండలంలోని నాగాయపల్లి, జయవరం, పోచెట్టిపల్లి గ్రామాల్లోని పాఠశాలలు ఇప్పటికీ మూతపడ్డాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పాటు సౌకర్యాలు లేకపోవడంతో ఈ పాఠశాలలను జిల్లా అధికారులు మూసివేయడంతో విద్యాబోధన కొనసాగడం లేదు.

సౌకర్యాలు నిల్..

మర్రిపల్లి జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉండగా ఇందులో 49 మంది విద్యార్థులున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారు. మూడేళ్లుగా ఈ పాఠశాల నుంచి పది ఫలితాల్లో మండల టాపర్లుగా నిలుస్తున్నారు. విశాలమైన స్థలం, పచ్చని చెట్లతో ఉన్న ఈ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవనాలను నిర్మించాలని గ్రామసర్పంచ్ కట్కం మల్లేశం అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు హైస్కూల్ పాత భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

అధికారులకు ప్రతిపాదనలు

మల్లారం, బొల్లారం, కొత్తపల్లి, మర్రిపల్లి ప్రైమరీ పాఠశాలలకు, ఫాజుల్‌నగర్, చెక్కపల్లి, వట్టెంల, మర్రిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లకు నిధుల మంజూరు విషయంపై జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు మండల అధికారులు తెలిపారు.

సౌకర్యాలు కల్పిస్తాం



మర్రిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సమస్యలు నెలకొనగా ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.9 లక్షలు మంజూరయ్యాయి. ఇంకా నిధులు రాలేదు. విద్యార్థులకు సౌకర్యాలను కల్పిస్తాం.
– వంగపల్లి తిరుపతి, ఎస్ఎంసీ చైర్మన్, మర్రిపల్లి

ప్రతిపాదనలు పంపించాం



మా గ్రామంలోని ఉన్న జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గదుల నిర్మాణం కోసం అధికారులకు విన్నవించాం. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. నూతన భవనాలు నిర్మించేందుకు దాదాపు రూ.50 లక్షలతో ప్రతిపాదనలను పంపించాం.
– కట్కం మల్లేశం, సర్పంచ్, మర్రిపల్లి

అధికారులకు నివేదించాం



వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వానికి విన్నవించాం. కొన్ని పాఠశాలల్లో మరమ్మతుల కోసం నిధుల మంజూరు కోసం జిల్లా అధికారులకు కోరాం.
– భూక్య బన్నాజీ, ఎంఈవో, వేములవాడ

సావిత్రిబాయి పూలేకు నివాళి



సిరిసిల్లకల్చరల్: నివాళి అర్పిస్తున్న టీజీపీ నాయకులు



కోనరావుపేటలో..



వీర్నపల్లిలో..

సిరిసిల్లఅర్బన్: దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలె వర్ధంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ దేవరాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ పాల్గొన్నారు.

సిరిసిల్లకల్చరల్: అంబేడ్కర్‌నగర్ పాఠశాలలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీజీఏ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్దన్, బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడి గంగరాజు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర సమన్వయ కర్త కంచర్ల రవిగౌడ్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ప్రిన్సిపాల్ సాగర్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల పూలమాల వేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

వీర్నపల్లి: కేజీబీవీ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ గుగులోత్ కళా, ఉపాధ్యాయినులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సుదర్శన్, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చందుర్తి: ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విక్రుర్తి లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఈశ్వరయ్య

గంభీరావుపేట: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఈశ్వరయ్య అన్నారు. గంభీరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం గంభీరావుపేట సెస్ కార్యాలయంలో వేదిక ఏర్పాటు చేశారు. వినియోగదారుల నుంచి సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరించారు. విద్యుత్ స్తంభాల తరలింపు, మిడిల్ పోల్స్ ఏర్పాటుకు సంబంధించి 30 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ అశోక్, ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఫోర్త్ మెంబర్ భూమారెడ్డి, సెస్ ఎండీ రామకృష్ణ, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, ఏఈ సిద్దార్థ్, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘం భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామంలో మహిళా సంఘం భవనానికి ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ రేణుక, ఉప సర్పంచ్ బ్రహ్మం, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని లింగారెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు కొండల్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి..

చందుర్తి: మండలంలోని రామన్నపేట గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ బైరగోని లావణ్య, స్థానిక సర్పంచ్ దుమ్ము అంజయ్య శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, ఎంపీడీఓ పత్తి రవీందర్, ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, చందుర్తి సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, సర్పంచులు లింగంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవనానికి..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, నాంపల్లి పీఏసీఎస్ చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనానికి..

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో అంబేడ్కర్ యువజన సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ మంతెన సంతోష్ శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ పల్లె మంజుల, కుమ్మరి దయాకర్, దేవయ్య, మల్లేశం, రాగెళ్ల వెంకటి, రమేశ్, వీడీసీ చైర్మన్ మంతెన మల్లేశం, అంబేడ్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆ రహదారి.. ప్రమాదకరం

- హడలిపోతున్న ప్రయాణికులు
- రోడ్లపై కానరాని స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ లిమిట్ బోర్డులు
- మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణం



తంగళ్లపల్లి మూలమలుపు వద్ద లారీలో నుంచి కింద పడిన బియ్యం బస్తాలు

తంగళ్లపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నుండి సిద్దిపేట వైపుగా ప్రతిరోజు వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే ప్రధాన రహదారి అది. కాని ప్రమాదాలకు నిలయంగా మారి నిత్యం రక్తమోడుతోంది. వాహనాల అతివేగంతో ఎందరో అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయి, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తంగళ్లపల్లి ప్రధాన రహదారి పేరు చెబితేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. వాహనాల స్పీడ్‌కు బ్రేకులు వేయడంలో అధికారులు విఫలం కావడంతో ప్రతిరోజు ఏదో ఒక ప్రమాదం జరుగుతునే ఉంది.

స్పీడుకు బ్రేకులు ఏవి?

తంగళ్లపల్లి నుంచి సిద్దిపేట జిల్లా శివారు వరకు ప్రధాన రహదారిపై దాదాపు 20 వరకు ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. కాని స్పీడ్ బ్రేకర్లు మాత్రం ఐదు చోట్ల మించి లేవంటే అతిశయోక్తి కాదు. వాహనాలు అతివేగంతో ప్రయాణించడం వేగానికి కళ్లెం వేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకుండా వదిలేయడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రం నుంచి సారంపల్లి గ్రామ శివారు వరకు వాహనాలు రేసులో పోటీపడినట్లుగా వేగంతో వెళుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

కానరాని స్పీడ్ లిమిట్ బోర్డులు

ప్రతి ప్రధాన రహదారిపై ఏ ప్రాంతంలో ఎంత వేగంతో వెళ్లాలో సూచిస్తూ రోడ్డు రవాణా శాఖ వారు స్పీడ్ లిమిట్ బోర్డులను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ తంగళ్లపల్లి ప్రధాన రహదారి పొడవునా స్పీడ్ లిమిట్ బోర్డులను చూద్దామన్నా కానరావట్లేదు. ప్రమాదం జరిగినపుడు హడావుడి చేయడం తర్వాత మరిచిపోవడం అధికారులకు నిత్యకృత్యంగా మారింది. ప్రజల ప్రాణాలే కదా మాకేంటి అనుకుంటున్నారో ఏమో..? కానీ మీ కుటుంబ సభ్యులు కూడా అదే రోడ్డుపై ప్రయాణాలు చేయాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలని సామాన్య ప్రజలు అధికారులకు హితవు పలుకుతున్నారు.

అతివేగానికి ప్రాణాలు బలి

అవసరమైన చోట ఎటువంటి స్పీడ్ లిమిట్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు దూసుకుపోతూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి.


➡ ఇటీవల పద్మనగర్ గ్రామశివారులో లారీ, కారు అతివేగంగా వచ్చిన పాపానికి స్కూటీపై వెళుతున్న సిరిసిల్లకు చెందిన బిట్ల మహేందర్ అక్కడికక్కడే మృతిచెందగా, బిట్ల అఖిల్ తీవ్ర గాయాలపాలయ్యాడు.

➡ సారంపల్లిలో రేగుల రాములు అనే వృద్ధుడిని రోడ్డు దాటుతుంటగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ప్రాణాలు వదిలాడు. బద్దెనపల్లి గ్రామశివారులో లారీ ఢీకొనడంతో ఇందిరమ్మ కాలనీకి చెందిన వ్యక్తి మృతదేహం నాలుగు బాగాలైంది..

➡ పద్మనగర్ గ్రామ శివారు ప్రమాదకర మూలమలుపు వద్ద సిద్దిపేటకు చెందిన హనుమాన్ మాలదారుల కారు బోల్తాపడగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

➡ జిల్లెల్లకు చెందిన భార్య భర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వాహనం అదుపుతప్పి గర్భిణీ అయిన భార్య అక్కడికక్కడే మృతి చెందింది. ఇలా అతివేగంతో వాహనాలు ప్రయాణిస్తుండడంతో ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ లిమిట్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



పోలీస్ శాఖ తరుపున తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రిస్తున్నాం. తరుచూ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేపడుతున్నాం.
– పి.లక్ష్మారెడ్డి, ఎస్సై, తంగళ్లపల్లి

సంక్షిప్తంగా..

మహిళలకు సన్మానం

సిరిసిల్లటౌన్: స్థానిక ఐదో వార్డులోని గోదావరి బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ వారోత్సవాల సందర్భంగా బ్యాంక్ సిబ్బంది పలు రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవాల్లో భాగంగా మహిళ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్స్, మహిళ మెప్మా సిబ్బందికి ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 14 బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిర గ్రామంలో ఆలయ చైర్మన్ పని లక్ష్మణ్ ఆధ్వర్యంలో అష్టమ వార్షికోత్సవం పురస్కరించుకొని సీతారాముల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగర్, నాయకులు భాస్కర్, శ్రీనివాస్, అంజయ్య, రాజిరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పంటల నమోదు పరిశీలన

బోయినపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామంలో రైతుల యాసంగి పంటల నమోదును శుక్రవారం మండల వ్యవసాయాధికారి ప్రణీత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంటలకు సంబంధించిన సందేహాలు ఉంటే సంబంధిత క్లస్టర్ ఏఈవో దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే వరి చేలలో అగ్ని తెగులు నివారణ చర్యల గూర్చి రైతులకు అవగాహన కల్పించారు.

కంటి వెలుగు ప్రారంభం

వీర్నపల్లి: మండలంలో వన్‌పల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ లత ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్, సూపర్‌వైజర్ శోభారాణి, అప్తాలమాలజిస్ట్ అశ్విని, ఏఎన్ఎంలు, మంజూల, ఇంద్ర, ఆశా వర్లర్లు, ప్రేమలత, స్వప్న, సరిత, వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఫ్లెక్సీల చించివేత

ముస్తాబాద్: ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ముస్తాబాద్‌లో తాము వేసిన ఫ్లెక్సీలను చించివేశారని బీజేపీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. ముస్తాబాద్‌లో స్వామి వివేకానంద విగ్రహం వద్ద బీజేపీ నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ యెల్ల గిరిధర్‌రెడ్డి, బండి శ్రీకాంత్, ఉపేంద్ర, రమేశ్, గోపి, శ్రీకాంత్, కల్యాణ్ పాల్గొన్నారు.

క్రీడామైదానానికి స్థలం కేటాయించాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని క్రీడా మైదానం కోసం కేటాయించాలని యువజన సంఘాల నాయకులు శుక్రవారం ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. మండల యువజన సంఘాల అధ్యక్షుడు ఉప్పుల అమరేందర్, పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకం

నూతన కార్యవర్గం

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామపరిధిలోని అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యాగ యాదగిరి, ఉపాధ్యక్షుడు వంతడుపుల శంకర్, కార్యదర్శి బెజ్జంకి సుమన్, ఆర్గనైజర్ వంగడుపుల నర్సయ్య, కార్యవర్గసభ్యులుగా శ్యాగ రవీందర్, దోమకొండ రాజమల్లు, శ్యాగ భూమయ్య, రవి, నందు, దేవయ్య, సురేశ్, మహేశ్, వంతడుపుల చంద్రం, సురేశ్, శ్రీనివాస్, కిషన్, గంగాపురం లచ్చయ్య ఎన్నికయ్యారు.

పుస్తె మెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్దిలో కొండం సులోచన, బాల్‌రాజుల కూతురు రజిత వివాహానికి బీజేపీ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ నేత పుస్తె మెట్టెలను శుక్రవారం అందజేశారు. సర్పంచ్ కిషన్‌రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన ఎడబోయిన భాగ్య–మల్లేశం అనే నిరుపేద దంపతుల కూతురు స్వాతి వివాహానికి సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి శుక్రవారం పుస్తె మెట్టెలు అందజేశారు.

రుణాల ప్రొసీడింగ్స్ పంపిణీ



ప్రొసీడింగ్స్‌తో మహిళా సంఘాల నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీలో మహిళ సంఘాలకు వచ్చిన వడ్డీ లేని రుణాలు రూ.2.26 కోట్ల ప్రొసీడింగ్స్‌లను ఎంపీపీ పిల్లి రేణుక శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఏపీఎం మల్లేశం, సీసీలు, వీఓఏలు, మహిళ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని 979 స్వయం సహాయక మహిళా సంఘాలకు విడుదలైన రూ.2,03,51,000 సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను శనివారం సంఘాల ప్రతినిధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మధుసుదన్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం సుదర్శన్, వైస్ ఎంపీపీ లత, మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత, సీసీలు పాల్గొన్నారు.

నైపుణ్యం చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

సిరిసిల్లఎడ్యుకేషన్: స్థానిక వెంకంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేతిరాత శిక్షణ తరగతుల్లో నైపుణ్యం కనపరిచిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మున్సిపల్ కౌన్సిలర్ కల్లూరి రాజు ప్రశంసాపత్రాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు రాజు, చేతిరాత నిపుణులు కాంభోజ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

సిరిసిల్లఅర్బన్: స్థానిక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 15 రోజుల పాటు చేతి రాత శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాలిగ్రఫీ శిక్షకుడు వెంకటేశం, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుకలు



బోనాలు తీస్తున్న మహిళలు

కోనరావుపేట: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నిమ్మపల్లిలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచులు కదిరె శ్రీనివాస్, రాములునాయక్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఆర్ఎస్ఎస్ చైర్మన్ గోగు ప్రతాపరెడ్డి, ముదిరాజ్ సంఘం బాధ్యులు రాజు, రాజేశం, దేవయ్య పాల్గొన్నారు.